క్లుప్తంగా

విద్యార్థినికి సన్మానం



విద్యార్థిని జాహ్నవిని సన్మానిస్తున్న కేవీ రమణాచారి, వేణుగోపాలచారి

హుజూర్‌నగర్ : పట్టణానికి చెందిన ముడుంబా జాహ్నవి పదోతరగతి పరీక్ష ఫలితాల్లో 10కి 10 సాధించింది. ఆదివారం హైదరాబాద్‌లో తెలంగాణ శ్రీ వైష్ణవ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి, తెలంగాణ నీటిపారుదల శాఖ చైర్మన్ సముద్రాల వేణుగోపాలచారి విద్యార్థినిని సత్కరించి ప్రశంసపత్రం అందజేశారు.

ఎమ్మార్పీఎస్ కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీకి నియామక పత్రాలు అందజేస్తున్న నాయకులు

కోదాడరూరల్ : మండలంలోని అడ్లూరు గ్రామంలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘం నూతన గ్రామ కమిటీని ఎంఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు ఏపూరి రాజుమాదిగ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వేల్పుల మనోజ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా గుండెపంగు సందీప్, కుందుకూరి రవీంద్ర, కార్యదర్శులుగా నందిగాం వెంకటేష్, లక్ష్మీనారాయణ, ప్రచార కార్యదర్శులుగా గోవింద్, ఏసురత్నంతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. ఈనెల 17న సూర్యాపేటలో జరిగే ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా స్థాయి సమావేశానికి అనుబంధ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో పులి రాజారావు, కందుకూరి తిరపయ్య, ఆకుల శ్రీను తదితరులు ఉన్నారు.

మెప్మా ఆర్పీల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రమీల

కోదాడ : పట్టణ పేదరిక నిర్మూలన (మెప్మా) సంస్థలో పనిచేస్తున్న రిసోర్స్‌పర్సన్స్ (ఆర్పీ)ల సమస్యలు పరిష్కరించాలని బీజేపీ మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి చలిగంటి ప్రమీల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో మెప్మా ఆర్పీలతో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఆర్పీలకు ఇస్తున్న రూ.4వేల జీతం వారి కుటుంబానికి ఏ విధంగా సరిపోదని, కుటుంబం ఎలా గడుస్తుందని అన్నారు. ప్రభుత్వం తక్షణమే వారికి రూ.20వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆర్పీలు పాల్గొన్నారు.

రోడ్డు, ఎన్ఎస్పీ కాల్వ పనుల పరిశీలన



శ్మశానవాటిక రోడ్డు పనులు పరిశీలిస్తున్న సర్పంచ్, నాయకులు

మఠంపల్లి : మండల కేంద్రంలోని ఎస్సీ శ్మశానవాటికకు వెళ్లేందుకు గ్రామపంచాయతీ నిధులతో చేపట్టిన రోడ్డు మరమ్మతు పనులను ఆదివారం సర్పంచ్ మన్నెంశ్రీనివాసరెడ్డి స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. అదే విధంగా ఎన్ఎస్పీ కాల్వను పరిశీలించి కాల్వలో పూడిక పేరుకుపోవడంతో అధికారుల దృష్టికి తీసుకెళ్లి కాల్వ మరమ్మతులు చేయించి రైతులకు సాగునీరందించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఇరుగు పిచ్చయ్య, గ్రే గోల్డ్ సిమెంట్స్ అధికారులు మద్ది శ్రీనివాసరెడ్డి, సత్యనారాయణరెడ్డి, జగదీష్, వార్డుసభ్యులు సాయిలు, ఆంతోని, పుల్లారెడ్డి, సురేష్‌గౌడ్, మోషా, వెంకన్న, తదితరులున్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు ఆటల పోటీలు



క్యారమ్ ఆడుతున్న రిటైర్డ్ ఉద్యోగులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రిటైర్డ్ ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం క్యారమ్స్, చెస్‌పోటీలు నిర్వహించారు. విజేతలకు ఆగస్టు 15న బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సమస్యలకు నిలయం బుడిగజంగాల కాలనీ

- కాలనీలో కానరాని మౌలిక వసతులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



సిరిపురంలోని బుడిగజంగాల కాలనీ



కాలనీలో గుడిసెల మధ్య పారుతున్న మురుగునీరు

నడిగూడెం : మండలంలోని సిరిపురం గ్రామ పరిధిలోని గల బుడిగజంగాల కాలనీ సమస్యలకు నిలయంగా మారింది. ఆ కాలనీలో 30కుటుంబాలకు పైగా బుడిగజంగాలు ఎలాంటి వసతులు లేకుండా 31ఏళ్లుగా జీవనం సాగిస్తున్నారు. గ్రామానికి ఆనుకుని ఉన్నా వెలివేసినట్లే అనే చందగా మారింది వారి జీవనం. వారిని అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకునే దాఖలు సైతం దాదాపు లేవు. వారికి ఓటు హక్కు ఉన్నా అనేక సమస్యలతో సతమతమవుతూ ఎవరికీ చెప్పుకోలేక, పట్టించుకొనేవారు లేక దయనీయ పరిస్థితిలో నివసిస్తున్నారు. సిరిపురం గ్రామంలో ఎస్సీకాలనీ వెంట ఉన్న ప్రభుత్వ స్థలంలో 31సంవత్సరాలుగా 30కి పైగా బుడిగ జంగాల కాలనీ ప్రజలు నివాసముంటున్నారు. రోజురోజుకూ అభివృద్ధి చెందుతున్న ప్రస్తుత రోజుల్లో ఇంకా పూరి గుడిసెల్లోనే వారు నివాసముంటున్నారు. మూడేళ్ల కిందట ఆ కాలనీ ప్రజలు ఉంటున్న స్థలాల్లో వారి ఇళ్లను తొలగించి, మరొక చోటికి వారిని తరలించి, ఆ స్థలంలో డబుల్ బెడ్‌రూం కాలనీని నిర్మించారు. దీంతో వారు పక్కనే ఉన్న మరో ప్రభుత్వ స్థలంలో ఆ కాలనీవాసులు గుడిసెలు వేసుకొని బిక్కుబిక్కు మంటూ నివాసముంటున్నారు.

కాలనీలో కానరాని డ్రెయినేజీలు..

30కుటుంబాలకు పైగా నివాసముంటున్న ఆ కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు నీరు వీధుల్లో చేరి అధ్వానంగా మారింది. కాలనీ చుట్టూ ముళ్ల పొదలు ఉన్నాయి. విషపురుగులతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనతో నివాసముంటున్నారు. ప్రతి వర్షాకాలంలో నిత్యం అనేక మంది సీజనల్ వ్యాధులతో బాధపడుతుంటారు.

పత్తా లేని వీధిదీపాలు..

కాలనీలో విద్యుత్ దీపాలు నాటి నుంచి ఏర్పాటు చేయకపోవడంతో ఆ కాలనీ ప్రజలు అంధకారంలోనే మగ్గుతున్నారు. రాత్రి సమయంలో పాములు, తేళ్లు సంచరిస్తున్నాయని వాపోతున్నారు.

తాగునీరు కరువు..

కాలనీకి తాగునీటి సరఫరా ఇప్పటికీ పంచాయతీ అధికారులు ఏర్పాటు చేయలేదు. దీంతో గ్రామంలోకి వెళ్లి తాగేందుకు, వాడుకునేందుకు నీటిని తెచ్చుకుంటున్నారు. కొనిసార్లు కాలనీ పక్కనే ఉన్న ఎత్తిపోతల పథకం మైనర్‌కాల్వ నీటిని తెచ్చుకొని ఉపయోగించుకుంటున్నారు. సమస్యలతో సతమతమవుతున్నామని సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులకు అనేక సార్లు చెప్పినా స్పందనకరువైందని వారు ఆరోపిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వారు వేడుకుంటున్నారు.

కరెంట్ సౌకర్యం లేదు



31ఏళ్లుగా సిరిపురంలో నివాసముంటున్నాము. మా కాలనీలో అందరికీ ఓటు హక్కు, రేషన్‌కార్డులు ఉన్నాయి. సిరిపురంలో నివసిస్తున్నా గానీ అనేక సమస్యలతో గ్రామంలో వెలివేసినట్లు ఉంటున్నాము. కనీసం కరెంట్ సౌకర్యం లేదు. దీంతో దీపాలు ఏర్పాటు చేసుకొని ఉంటున్నాము. రాత్రి సమయంలో విష పురుగులు సంచరిస్తున్నాయి. భయం గుప్పిట్లో ఉంటున్నాము.

– రామచంద్రు, జంగాల కాలనీ, సిరిపురం

కాలనీకి తాగునీరు కరువు



మా కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. నీటి సరఫరా లేదు. దీంతో గ్రామంలోకి వెళ్లి తాగునీటిని, వాడుకునేందుకు నీటిని తెచ్చుకుంటున్నాము. అధికారులు మా కాలనీని సందర్శించాలి. మా సమస్యలు పరిష్కరించాలి.

– లచ్చుమ్మ,జంగాల కాలనీ, సిరిపురం

అందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలి



మా కాలనీలో అన్నీ సమస్యలే ఉన్నాయి. ఏళ్ల తరబడి సమస్యలతో నివాసముంటున్నాము. మా కాలనీకి చెందిన ఏడుగురికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరయ్యాయి. మిగతా వారందరికీ మంజూరు చేసి, ఆదుకోవాలి. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– నిదానం సైదులు, సిరిపురం

వాసవీ క్లబ్ సేవలు అభినందనీయం

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్



నడిగూడెం : 108 అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్

కోదాడ : విద్యా, వైద్య సామాజిక రంగాల్లో వాసవీ క్లబ్ చేస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. ఆదివారం పట్టణంలో వాసవీ క్లబ్ కోదాడ ఆధ్వర్యంలో విజయవాడకు చెందిన రమేష్ ఆస్పత్రి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యా, వైద్యం ఖరీదైన ఈ రోజుల్లో స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి పేద, మధ్య తరగతి ప్రజలకు సేవలందించడం అభినందనీయమన్నారు. కోదాడ వాసవీ క్లబ్ సేవారంగంలో జిల్లాలో అగ్రస్థానంలో నిలవాలన్నారు. వాసవీ క్లబ్ తమ సేవా కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరం నిర్వహించిన ఐపీసీ ప్రోగ్రాం చైర్మన్ చల్లా విజయ్‌శేఖర్‌తో పాటు వాసవీక్లబ్ కార్యవర్గాన్ని ఆయన అభినందించారు. వైద్య శిబిరంలో రమేష్ ఆస్పత్రికి చెందిన డాక్టర్లు అవినాష్, గోపాల్‌దత్త రోగులకు బీపీ, షుగర్, హృద్రోగ సమస్యల పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ వైద్యులు డాక్టర్ ప్రమీల శ్రీపతిరెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, వాసవీ క్లబ్ కార్యవర్గం, సభ్యులు పాల్గొన్నారు.

వైద్యసేవలు సద్వినియోగం చేసుకోవాలి

నడిగూడెం : మండల ప్రజలు అత్యవసర వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి మంజూరైన 108 అంబులెన్స్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ పేదలకు విద్య, వైద్య సేవలను ఎప్పటికప్పుడు అందిస్తున్నారని అన్నారు. మండలానికి ప్రత్యేకంగా అంబులెన్స్ మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు స్థానికులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో 24గంటలు వైద్య సేవలు అందడంలేదని, సిబ్బంది కొరత ఉందని ఖాళీగా ఉన్న పోస్టులను మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ యాతాకుల జ్యోతి, స్థానిక సర్పంచ్ గడ్డం నాగలక్ష్మి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ కళ్యాణచక్రవర్తి, 108 ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం కో ఆర్డినేటర్ నజీరుద్దీన్, సూపర్‌వైజర్ సోమేశ్వరరావు, వైద్యసిబ్బంది షేక్.పాషా, రవీందర్, రమేష్, శిగ వెంకన్న, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్‌ను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న చందర్‌రావు

హుజూర్‌నగర్ : హైదరాబాద్‌లో ఈనెల 17, 18 తేదీల్లో జరిగే పీడీఎస్‌యూ రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్‌ను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చందర్‌రావు అన్నారు. ఆదివారం పట్టణంలోని శ్రామిక భవన్‌లో నిర్వహించిన సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లోని విద్యానగర్‌లో నిర్వహించే ఈ వర్క్‌షాప్‌కు రాష్ట్రవ్యాప్తంగా ఎంపికైన వివిధ యూనివర్సిటీల, కాలేజీల విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. తెలంగాణలో రూ.5వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ పెండింగ్‌లో ఉన్నాయని, అవి సకాలంలో అందక పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులు తమ చదువులను మధ్యలోనే నిలిపివేసే ప్రమాదం ఉందన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలు తెలంగాణ విద్యార్థులను, తల్లిదండ్రులను జలగల్లా పట్టిపీడిస్తున్నా, ఫీజుల పేరుతో కోట్లాది రూపాయల దోపిడీ చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం కనీసం చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. విద్యా సంస్థల్లో రోజుకో విద్యార్థి చనిపోతున్నా కనీసం తనిఖీలు చేయడం లేదన్నారు. ప్రభుత్వం 9ఏళ్లలో విద్యారంగాన్ని సర్వనాశనం చేసిందని, కార్పొరేట్ విద్యా సంస్థలకు కొమ్ముగాస్తుందని ఆయన ఆరోపించారు. సమావేశంలో పీడీఎస్‌యూ నాయకులు భాను, జగదీష్, విజయ్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు పథకాలను వినియోగించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జడ శ్రీనివాస్

హుజూర్‌నగర్ : కార్మిక సంక్షేమ బోర్డు అమలు చేస్తున్న పథకాలను కార్మికులు వినియోగించుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు జెట్టి ప్రసాద్ అన్నారు. చింతలపాలెం మండలం గుడిమల్కాపురంలో ఆదివారం బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. భవన నిర్మాణ పనులు చేసే ప్రతి సభ్యుడు వెల్ఫేర్ బోర్డులో సభ్యత్వ కార్డు తీసుకోవాలని బోర్డులోని బెనిఫిట్స్ వినియోగించుకోవాలన్నారు. వెల్ఫేర్ బోర్డులో కార్డు నమోదు చేసుకునేందుకు మీసేవలో ఓటీపీ, తంబు వేసే విధానాన్ని రద్దు చేయాలన్నారు. కార్మికులను ఇబ్బంది పెట్టే ఓటీపీ విధానాన్ని రద్దు చేసి పాత పద్ధతిని కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. కార్మికులకు సంక్షేమ పథకాలను ఎటువంటి ఆంక్షలు లేకుండా అమలు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని కోరారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సభ్యులు మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి చింతిరాల రవి, భవన నిర్మాణ కార్మికులు కందుకూరి కోటయ్య, ఎస్‌కే జానీపాషా, గోపాల్, కణితి యోహాన్, సీహెచ్ రవి, సీహెచ్ విజయ్, వై.కొండలు, ఎం.వెంకటేష్, సైదులు, వాణి తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ భక్తులకు రక్షణ కల్పించాలి

హుజూర్‌నగర్ : తిరుమల తిరుపతికి వెళ్లే భక్తులకు అలిపిరి నడకదారిలో ఇరువైపులా రక్షణ కవచంగా ఐరన్ జాలి ఏర్పాటు చేసి రక్షణ కల్పించాలని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి అన్నారు. ఆదివారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల అలిపిరి మార్గంలో 6ఏళ్ల చిన్నారి లక్షితపై చిరుత దాడి చేయడం దారుణమన్నారు. టీటీడీ తక్షణమే భక్తుల రక్షణ కోసం సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకురాలు ఆళ్ల భాగ్యమ్మ, గోపి, నాగయ్య, యాదయ్య తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగిఉండాలి

నడిగూడెం : సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని మండల రూరల్ మెడికల్ ప్రాక్టీస్ అసోసియేషన్ అధ్యక్షుడు తాళ్లపల్లి భాస్కర్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సంఘం మండల ఉపాధ్యక్షుడు కె.రమేష్, ప్రధాన కార్యదర్శి కె.ఉపేందర్, సీనియర్ వైద్యుడు కృష్ణ, గౌరవ అధ్యక్షుడు వీఎల్ఎన్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

స్వీపర్లకు కనీస వేతనాలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను

మఠంపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో 30ఏళ్లుగా పనిచేస్తున్న స్వీపర్లకు కనీస వేతనం రూ.15,500లు చెల్లించి వారిని రెగ్యులరైజ్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పాఠశాల స్వీపర్ల సంఘం మండల జనరల్‌బాడీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. పాఠశాలల్లో పరిశుభ్రతతో పాటు పిల్లలకు తాగునీరు, తదితర అవసరమైన సేవలు చేస్తున్న స్వీపర్లకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో సీఐటీయూ మండల కన్వీనర్ సయ్యద్‌రసమియా, స్వీపర్ల సంఘం మండల అధ్యక్షురాలు కుమారి, కార్యదర్శి లాల్‌సాబ్, గురువయ్య, భవానీ, సాలమ్మ, ముక్కంటి, వెంకటేశ్వర్లు, యశోద, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యుల సమస్యల పరిష్కారానికి కృషి



ప్రమాణస్వీకారం చేస్తున్న గ్రామీణ వైద్యుల సంఘం సభ్యులు

నడిగూడెం : గ్రామీణ వైద్యుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పి.లక్ష్మీనర్సయ్య తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామీణ వైద్యుల సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం గ్రామీణ వైద్యులకు అండగా ఉంటుందని, గ్రామీణ వైద్యులు కూడా ప్రభుత్వానికి అండగా ఉండాలన్నారు. అనంతరం ఖమ్మం పట్టణానికి చెందిన కార్తికేయ ఆస్పత్రి ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై డాక్టర్ బికె.ప్రసాద్ అవగాహన కల్పించారు. అనంతరం గ్రామీణ వైద్యుల సంఘం మండల నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేందర్, డాక్టర్ బ్రహ్మం, మండల అధ్యక్షుడు ఏ.శ్రీరాములు, సహ అధ్యక్షుడు కె.నాగభూషణం, ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.సైదులు, కోశాధికారి వి.సైదులు, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.నాగేశ్వరరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలి

నేరేడుచర్ల : పట్టణంలోని జాన్‌పహాడ్ రోడ్డులో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ కొణతం చిన వెంకట్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాన్‌పహాడ్ రోడ్డులో జరిగే పనులు నత్తనడకన సాగుతున్నాయని, రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీల కోసం కాల్వను తవ్వి వదిలేయడంతో వాహనాదారులు, దుకాణాదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని అన్నారు. 20రోజులుగా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచాయని, మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి విస్తరణ పనులను వేగవంతం చేయాలని కోరారు. ఆయన వెంట కౌన్సిలర్లు ప్రకాశ్, జితేందర్‌రెడ్డి, సుగుణమ్మ, నాగయ్య తదితరులున్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



తుంగతుర్తి : సూర్యాపేటలో సీతాయణం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి

సూర్యాపేట : విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. సూర్యాపేట మండలం ఎర్కారం గ్రామానికి చెందిన చప్పిడి కృష్ణారెడ్డి మనవరాలు పులగం సాధిక కొద్దిరోజుల క్రితం ఎంటెక్ (సీవీఆర్) కాలేజ్ హైదరాబాద్‌లో గోల్డ్ మెడల్ సాధించడంతో విషయం తెలుసుకున్న మంత్రి జగదీష్‌రెడ్డి ఆదివారం ఆమెను సూర్యాపేటలోని ఆయన క్యాంపు కార్యాలయంలో అభినందించారు. కార్యక్రమంలో సాధిక తండ్రి వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వై.వి, జిల్లా నాయకులు చిన్న శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

సీతాయణం పుస్తకం ఆవిష్కరణ

తుంగతుర్తి : కవి, గాయకులు, వైతాళికులను సన్మానించిన ఘనత సీఎం కేసీఆర్‌దే అని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. తుంగతుర్తికి చెందిన ఎర్ర హరికిషన్ రచించిన సీతాయణం పుస్తకాన్ని ఆదివారం సూర్యాపేటలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి జగదీష్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ కవులను, రచయితలను, గాయకులను, వైతాళికులను ప్రోత్సహిస్తున్నారని అన్నారు. అనంతరం ఎర్ర హరికిషన్‌ను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జ్యోతుల చంద్రశేఖర్, రామలింగారెడ్డి, జలగం పురుషోత్తం, నాగరాజు, చంద్రశేఖర్, గుండగాని శ్రీనివాస్, చిత్తలూరి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకునేందుకే పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న సాముల జైపాల్‌రెడ్డి

కోదాడరూరల్ : నియోజకవర్గంలోని ప్రజల సమస్యలు తెలుసుకునేందుకే అన్ని గ్రామాల్లో పాదయాత్ర చేస్తున్నట్లు సాముల జైపాల్‌రెడ్డి ఫౌండేషన్ చైర్మన్ సాముల జైపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కాపుగల్లు, తొగర్రాయి, గణపవరం, రామలక్ష్మీపురం, ఎర్రవరంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ ప్రాంత ప్రజలకు సేవ చేసేందుకు వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కోదాడ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని ప్రజలు నన్ను ఆశీర్వాదించాలని కోరారు. అందుకే మీ సమస్యలను తెలుసుకునేందుకు నేరుగా గ్రామాల్లో పాదయాత్రతో పర్యటిస్తున్నానని అన్నారు. గ్రామాల్లో అనేక సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో కొప్పుల కోటిరెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

నిరుపేదలకు ఆర్యవైశ్య సంఘం అండ



ఆర్థికసాయం అందజేస్తున్న క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : ఆర్యవైశ్య సంఘం నిరుపేద ఆర్యవైశ్యులకు అండగా ఉంటుందని, ఎవరు ఆధైర్యపడవద్దని వాసవి, వనితా క్లబ్ నిర్వాహకులు అన్నారు. ఆదివారం మండలంలోని సోమారం గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన మద్దాల లక్ష్మయ్య భార్య మల్లికాంబ వారం క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో క్లబ్ సభ్యులు లక్ష్మయ్యను పరామర్శించి దాతల నుంచి సేకరించిన రూ.37వేల నగదును అందజేశారు. తాము అండగా ఉంటామని, అధైర్యపడవద్దని ఆయనకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వాసవి, వనితా క్లబ్‌ల ఐపీసీ గరిణే అరుణాకుమారీ, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కొత్త లక్ష్మణ్, వీరేవల్లి శ్రీలత కోటేశ్వర్‌రావు, గజ్జల కోటేశ్వర్‌రావు, నటరాజ్, పరమేశం, పుల్లయ్య, భిక్షపతి తదితరులున్నారు.

పార్టీ బలోపేతానికి ప్రజలు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

హుజూర్‌నగర్ : నియోజకవర్గంలో టీడీపీ బలోపేతానికి ప్రజలు సహకారం అందించాలని ఆ పార్టీ నల్లగొండ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ మండవ వెంకటేశ్వర్లు కోరారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన పార్టీ పట్టణ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బడుగు బలహీన వర్గాలను ప్రోత్సహించే పార్టీ టీడీపీ అని, పార్టీ బలోపేతానికి నియోజకవర్గ ప్రజలు సహకారం అందించాలని కోరారు. అనంతరం పట్టణ కమిటీని ప్రకటించారు. పట్టణ అధ్యక్షుడిగా కొమ్మగాని వెంకటేశ్వర్లుగౌడ్, ప్రధాన కార్యదర్శిగా మీసాల సైదులు, ఉపాధ్యక్షుడిగా చంద్రగిరి సాంబ, సహాయ కార్యదర్శిగా వల్లపుదాసు కోటయ్యాగౌడ్, గౌరవ అధ్యక్షుడిగా తమ్మిశెట్టి రాములు, గౌరవ సలహాదారులుగా ఆళ్ల భాగ్యమ్మను నియమించారు. సమావేశంలో నాయకులు నాగునాయక్, కె.నాగయ్య, కనకరత్నం, రోషపతి, వంశీ, నాగరాజు, అంజయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ కాలువకు బీఎన్‌రెడ్డి పేరు పెట్టాలి

నాగారం : శ్రీరాంసాగర్ కాలువకు మాజీ ఎంపీ, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు భీంరెడ్డి నర్సింహారెడ్డి పేరు పెట్టాలని ఆయన కూతురు రాజేశ్వరిదేవి అన్నారు. ఎస్సారెస్పీ కాలువ వద్ద భీంరెడ్డి నర్సింహారెడ్డి స్మృతివనం ఏర్పాటు చేయాలని కోరుతూ బీఎన్ స్మారక కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మండల పరిధిలోని ప్రగతినగర్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళన సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రజాకార్లకు ఎదురెళ్లి పోరాడిన యోధుడు, భూమికోసం, భుక్తి కోసం, తెలంగాణ ప్రజల విముక్తి కోసం నైజాం సర్కార్‌కు వ్యతిరేకంగా పోరాడిన మహనీయుడు బీఎన్ రెడ్డి అని కొనియాడారు. బీఎన్‌రెడ్డి తన తుదిశ్వాస వరకు తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాలకు శ్రీరాంసాగర్ నీటిని తేవాలని కృషి చేశారని గుర్తుచేశారు. బీఎన్ రెడ్డి చేపట్టిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్సారెస్పీ కాలువ వద్ద బీఎన్‌రెడ్డి స్మృతివనం ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రాంగణ ఫలకాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బీఎన్ స్మారక కమిటీ అధ్యక్షుడు కొత్తగట్టు మల్లయ్య, మల్లు కపోతంరెడ్డి, తాటికొండ సీతయ్య, తన్నీరు రాంబాబు, ఈదుల వీరపాపయ్య, సోమిరెడ్డి, యాదగిరి, కడెం మల్లయ్య, సుందర్‌రావు, భిక్షం, కరుణ, రహిమాన్, సైదులు, కొండల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని అంబేద్కర్ కాలనీకి చెందిన కొమ్ము రాజా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఓజో ఫౌండేషన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కుక్కల వెంకన్న ఆదివారం అతడి కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు రాజేష్, మండెం వేణు, అనీల్‌గౌడ్, నాగరాజుయాదవ్, వంశీ, అశోక్, శ్రీరాములు, సైదులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం..!



కోదాడరూరల్ : మండల పరిధిలోని కోదాడ – మేళ్లచెరువు ప్రధాన రహదారిలో గుడిబండ శివారులో ఓ చెట్టు పూర్తిగా ఎండిపోయి మోడుబారిన కొమ్మలు రోడ్డుపై పడే విధంగా ఉన్నాయి. ఆ రహదారిపై నిత్యం వందల సంఖ్యలో వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ఎర్రవరం ఆలయానికి వెళ్లే భక్తులతో ఆ రోడ్డులో వాహనాల సంఖ్య వేలకు చేరుకుంది. ఈ వృక్షం ఎండిపోయి ప్రమాదకరంగా మారడంతో ఎప్పుడు కూలుతుందోనని వాహనదారులు, ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. ఆ చెట్టు విరిగిపడి ప్రమాదం జరగకముందే గ్రామపంచాయతీ, ఆర్ అండ్‌బీ అధికారులు స్పందించి తొలగించాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.